క్లుప్తంగా

ఎంపీ వంగా గీతకు అస్వస్థత



వైద్య సేవలు పొందుతున్న వంగా గీత

పిఠాపురం: ఎన్నికల ప్రచారంలో ఉన్న వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత గురువారం అస్వస్థతకు గురయ్యారు. పిఠాపురం మండలం ఎఫ్‌కేపాలెంలో గురువారం ఉదయం ఆమె ఎన్నికల ప్రచారం చేపట్టారు. అప్పటికే నీరసంగా ఉన్న ఆమె నిలబడలేని పరిస్థితికి చేరడంతో, వెంటనే ఎన్నికల ప్రచారాన్ని ఆపి వేసి, ఆమెను కారులో పిఠాపురంలోని ఆమె కార్యాలయానికి తరలించారు. వైద్యులు ఎంవీవీ జగన్మోహన్ ఆమెకు వైద్య పరీక్షలు చేసి, చికిత్స అందిస్తున్నారు. ఆమెకు షుగర్, బీపీ లెవెల్స్ బాగా పడిపోయినట్టు, ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు ఆయన తెలిపారు. సుమారు 48 గంటలు విశ్రాంతి అవసరమని చెప్పారు. కొన్ని రోజులుగా మండుటెండలో రేయింబవళ్లు తేడా లేకుండా విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించడం వల్ల అస్వస్థతకు గురైనట్టు వైద్యులు తెలిపారు.

గ్రామాల సుస్థిర అభివృద్ధికి జీపీడీపీ



జీపీడీపీ సమీక్షలో మాట్లాడుతున్న ఈఓ పీఆర్డీ సత్యనారాయణ

పెద్దాపురం: గ్రామాల సుస్థిర అభివృద్ధికి జీపీడీపీ దోహదపడుతుందని కరప ఈఓపీఆర్‌డీ బీవీ సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఈఓపీఆర్‌డీ నక్కా సత్యనారాయణమూర్తి అధ్యక్షతన మండల స్థాయిలో జీపీడీపీపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి జీపీడీపీ బృందం సభ్యుడు సత్యనారాయణ మాట్లాడుతూ మీమీ పంచాయతీల్లో తయారు చేసిన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలను పరిశీలించి తుది నివేదికలను జిల్లా అధికారులకు సమర్పించనున్నట్టు తెలిపారు. అనంతరం గ్రామాల వారీగా ఆయన సమీక్షించారు. ఈ సమావేశంలో బృందం సభ్యులు నాగేశ్వరరావు, సునీల్‌కుమార్, రాంజీ, ప్రసన్నాంజనేయులు, ఏడీపీఎం జి.స్వామి తదితరులున్నారు.

పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

గొల్లప్రోలు: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2024–25కు అనుసరించాల్సిన విధివిధానాలపై పంచాయతీ కార్యదర్శులకు గురువారం శిక్షణ నిర్వహించారు. సామర్లకోటలోని జిల్లా పంచాయతీ శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు డీపీఆర్సీ బృందం ఆయా మార్గదర్శకాలపై అవగాహన కల్పించింది. పంచాయతీ కార్యదర్శులు మాస్టర్ ప్లాన్ రూపొందించుకోవాలని సూచించింది.

మాండవ్య నారాయణుని కల్యాణోత్సవాల ప్రారంభం



మాండవ్య నారాయణస్వామి గ్రామోత్సవం

సామర్లకోట: స్థానిక గోదావరి తీరంలో కొలువైన శ్రీ, భూ సమేత మాండవ్య నారాయణ స్వామి కల్యాణోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం గరుడ వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులతో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయం నుంచి గ్రామోత్సవం చేయించి తిరిగి తీసుకువచ్చారు. దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం స్వామి, అమ్మవార్లకు మంగళ స్నానాలు, పంచామృతాభిషేకం, రాత్రికి కల్యాణం జరగనున్నాయి.

ఒకటో తేదీ నుంచి యోగా శిక్షణ

కాకినాడ: స్థానిక వివేకానందపార్కు ఆవరణలోని రెడ్‌క్రాస్ యోగా కేంద్రంలో వచ్చేనెల 1 నుంచి 16వ తేదీ వరకు వేసవి యోగా శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. 8 నుంచి 14 సంవత్సరాలలోపు బాలబాలికల కోసం ఈ శిక్షణా శిబిరం ఏర్పాటు చేశామన్నారు. శిబిరంలో పిల్లలకు యోగాసానాలు, ప్రాణాయామం, ధ్యానం, సూర్య నమస్కారాలు, ధార్మిక, నైతిక విలువలు, దేశభక్తి గీతాలు, హస్తకళలు, చేతిరాతలు తదితర అంశాల్లో శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు 96038 81211, 96409 83726 నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ముందుగా నమోదు చేసుకున్న 50 మందికి మాత్రమే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు.

అన్న పిలుపు కోసం.. అంతా ఏకమై..



- బస్సు యాత్ర విజయవంతానికి పిఠాపురంలో అంతా సిద్ధం
- సీఎం వైఎస్ జగన్‌కు స్వాగతం పలికేందుకు సన్నద్ధమైన ప్రజలు
- ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు

గుండెలో గూడు కట్టుకున్న అభిమానం కట్టలు తెంచుకుని.. జన సంద్రంగా మారనుంది. కష్టాల కడలి నుంచి తమ జీవితాలను గట్టెక్కించిన ఆ జన నాయకుడు కళ్లెదుట సాక్షాత్కరించనున్నారని తెలిసి.. వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. అవ్వాతాతలు.. అక్కచెల్లెళ్లతో పాటు, 'జగనన్నా' అని అభిమానంగా పిలిచే అన్నదమ్ములు.. ఇలా ప్రతి ఒక్కరూ తమ బతుకులను బాగుచేసిన జన నేత రాక కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. తమ తలరాత మార్చిన ఆ మహానుభావుడిని చూసి తరించాలని కృతనిశ్చయంతో ఉన్న ఆ జన హృదయాలకు అడ్డుకట్ట వేయగలగడం బహుశా ఎవరి తరం కాదేమో.!

పిఠాపురం: నాడు 2019 మార్చి 23న గత సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి ప్రతిపక్ష నేతగా వచ్చిన జననేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అప్పట్లో ఘన స్వాగతం పలికిన పిఠాపురం నియోజకవర్గ ప్రజలు.. అఖండ మెజార్టీతో వైఎస్సార్ సీపీని గెలిపించారు. నేడు 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రతో కాకినాడ జిల్లాలో ప్రవేశించనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం పిఠాపురంలో అడుగుపెట్టనున్నారు. ముఖ్యమంత్రి హోదాలో వస్తున్న ఆయనను.. మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు మేమంతా సిద్ధమంటున్న ప్రజానీకం.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికేందుకు సన్నద్ధమయ్యారు. గత ఎన్నికల ప్రచార సభలో పిఠాపురం నియోజకవర్గానికి ఇచ్చిన హామీలను నూటికి నూరు శాతం నెరవేర్చి వస్తున్న ఆయనకు బ్రహ్మరథం పట్టేందుకు పార్టీ శ్రేణులతో పాటు, స్థానిక ప్రజలు ఆయన రాక కోసం ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారు.

నియోజకవర్గానికి నిధుల జల్లు

పిఠాపురం నియోజకవర్గానికి ఐదు దశాబ్దాల్లో మునుపెన్నడూ లేని విధంగా.. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.వందల కోట్ల నిధులు మంజూరు చేసి అభివృద్ధి పథంలో నడిపించారు. ముఖ్యంగా మత్స్యకార, చేనేత వంటి బీసీ వర్గాలు, కాపు సామాజికవర్గం అధికంగా ఉన్న నియోజకవర్గంలో ప్రధాన సమస్యలకు ఆయన పరిష్కారం చూపించారు. ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని నియోజకవర్గ తీర ప్రాంతాన్ని తీర్చిదిద్దుతానని ఆయన ఇచ్చిన మాట ప్రకారం రూ.350 కోట్ల వ్యయంతో మేజర్ హార్బర్ నిర్మించి, తీర ప్రాంతాన్ని పారిశ్రామిక తీరంగా తీర్చిదిద్దారు. వేట నిషేధ పరిహారం పెంపు, దానిని సకాలంలో ఇవ్వడం, ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారులకు నష్ట పరిహారం పెంపు, డీజిల్ సబ్సిడీ వంటి అనేక పథకాలతో ఆ వర్గానికి మునుపెన్నడూ లేని సంక్షేమం చేసి చూపించారు. గత 15 ఏళ్లుగా ఎటువంటి పరిశ్రమలు రాని, కాకినాడ ఎస్‌ఈజెడ్‌లో భూములు కోల్పోయిన రైతన్నలకు ఆయన ఇచ్చిన మాట ప్రకారం, అధికారంలోకి వచ్చిన వెంటనే కమిటీ వేసి రైతులకు 2,150 ఎకరాల భూములను తిరిగి ఇచ్చేయడంతో అప్పటి వరకు పోరాటాలతో సతమతమైన రైతాంగం ఆయనకు క్షీరాభిషేకాలు చేశారు. ఎటువంటి అవరోధాలు లేకపోవడంతో, ఎస్‌ఈజెడ్‌లో పరిశ్రమల స్థాపనకు పెట్టుబడులు పెట్టేందుకు అనేక కార్పొరేట్ సంస్థలు ముందుకు వచ్చాయి. గత ఐదేళ్లలో రూ.వేల కోట్లతో పరిశ్రమలు ఇక్కడ ఏర్పాటయ్యాయి. లక్ష మందికి పైగా ఉపాధి అవకాశాలు వచ్చాయి. చేనేత కార్మికులకు అండగా నిలబడి, చేనేత పరిశ్రమను మళ్లీ అభివృద్ధి దిశలో పరుగులు పెట్టించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన కృషిని నేత కార్మికులు మరువలేకపోతున్నారు. పిఠాపురం నియోజకవర్గానికి సంక్షేమం, అభివృద్ధిని ఏకకాలంలో చూపించిన జననేత వస్తున్నారన్న సమాచారంతో అన్ని వర్గాల ప్రజలు ఆయన రాక కోసం ఎదురు చూస్తున్నారు.

యాత్ర కొనసాగేదిలా..

మేమంతా సిద్ధం బస్సు యాత్ర 18వ రోజైన శుక్రవారం కాకినాడ నుంచి పిఠాపురం మండలం చిత్రాడ వద్ద నియోజకవర్గంలో అడుగుపెట్టనుంది. అక్కడి నుంచి సుమారు 18 కి.మీ. ఆయన బస్సు యాత్ర నియోజకవర్గంలో కొనసాగనుంది. దారి పొడవునా ఆయనకు స్వాగతం పలికేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారు. చిత్రాడ నుంచి పిఠాపురం పాదగయ క్షేత్రం, విరవాడ సెంటర్, రాయవరం సెంటర్ మీదుగా గొల్లప్రోలుకు చేరుకోనున్నారు. అక్కడి నుంచి ప్రత్తిపాడు సెంటర్, తాటిపర్తి సెంటర్ మీదుగా గొల్లప్రోలు మండలం చేబ్రోలు చేరుకోనున్నారు. అక్కడి నుంచి ప్రత్తిపాడు నియోజకవర్గం కత్తిపూడి వెళ్లనున్నారు.

స్వాగత సన్నాహాలు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్ర అంతా 216 జాతీయ రహదారిలో జరగనుండడంతో, రోడ్డు పొడవునా అన్ని ప్రధాన కూడళ్లలోను ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలకడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆధ్వర్యంలో భారీ స్వాగత సన్నాహాలు చేశారు. అన్ని గ్రామాల నుంచి భారీగా జనం తరలివచ్చే అవకాశం ఉండడంతో, అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నియమావళి మేరకు ఎవరికి వారు స్వచ్ఛందంగా వచ్చే అవకాశం ఉండడంతో, ఎక్కడా ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసేలా వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత నాయకులకు, కార్యకర్తలకు తగిన సూచనలు ఇచ్చారు.

నియోజకవర్గం మీదుగా ముఖ్యమంత్రి బస్సు యాత్ర

సామర్లకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహిస్తున్న 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర శుక్రవారం నియోజకవర్గం మీదుగా అచ్చంపేట జంక్షన్‌కు చేరుకోనుంది. రాజానగరం నియోజకవర్గం నుంచి పెద్దాపురం ఏడీబీ రోడ్డు మీదుగా పాండవుల మెట్ట సమీపంలోని పెద్దాపురం–సామర్లకోట ఏడీబీ రోడ్డులోకి ప్రవేశిస్తుంది. ఈ మేరకు సామర్లకోట ఫ్లైఓవర్ బ్రిడ్జిపై భారీ ఎత్తున స్వాగతం పలకడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా రెండు మున్సిపాలిటీలు, పీబీ దేవం, జి.మేడపాడు, వేట్లపాలెం, హుస్సేన్‌పురం గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదకు చేరుకుంటారు. సామర్లకోటలోని మిగిలిన గ్రామాలకు చెందిన వారు, పెద్దాపురం మండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలు అచ్చంపేట జంక్షన్‌లో జరిగే బహిరంగ సభకు హాజరుకానున్నారు. ఈ మేరకు పోలీసులు బ్రిడ్జిపై ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

శ్రేణులు భారీగా తరలిరావాలి



రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అచ్చంపేట జంక్షన్‌లో నిర్వహించే సిద్ధం బహిరంగ సభకు శుక్రవారం ఉదయం సామర్లకోటలో భారీ స్వాగతం చెప్పడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరుకావాలని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు పిలుపు నిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతంతో పెద్దాపురం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయం తథ్యమనేలా ఉండాలన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్దకు భారీగా తరలి రావాలన్నారు. అలాగే మధ్యాహ్నం 3 గంటలకు అచ్చంపేటలో జరిగే బహిరంగ సభలోను అధిక సంఖ్యలో పాల్గొన్నాలని, జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరి ఆశీస్సులు అందజేయాలన్నారు.

అందరికీ అందుబాటులో ఉంటాం

- దవులూరి సతీమణి చంద్రకళ ప్రచారం



పెద్దాపురంలో తన భర్త దొరబాబుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న చంద్రకళ

పెద్దాపురం: స్థానికులం.. ప్రజలకు ఏ కష్టం వచ్చినా అందుబాటులో ఉంటాం. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబును గెలిపించమంటూ ఆయన సతీమణి చంద్రకళ కోరారు. పట్టణం 1, 2 వ వార్డులో ఆమె, చిన్న కుమార్తె సాత్విక, అయ్యరక కార్పొరేషన్ చైర్మన్ ఆవాల లక్ష్మీ రాజేశ్వరి, మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, వార్డు కౌన్సిలర్లు ఆరెళ్లి వీర్రాఘవులు, ఆకుల కృష్ణబాపూజీ, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, తాడి రాజశేఖర్, మాజీ కౌన్సిలర్ ఆరెళ్లి వెంకటలక్ష్మి, క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మడికి సోనీ, పార్టీ మహిళా కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులతో కలసి ఎన్నికల ప్రచారం చేశారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమం కొనసాగాలంటే ప్రజలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి పట్టం కట్టాలని, నియోజకవర్గ ప్రజలందరికి అండగా ఉంటామన్నారు. స్థానికంగా ప్రజా సమస్యలపై పూర్తి అగాహన ఉందని, నియోజకవర్గ ప్రజలు ఆదరించి స్థానికుడైన ఎమ్మెల్యే అభ్యర్థి దొరబాబు, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌కు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని చంద్రకళ కోరారు. కౌన్సిలర్లు త్సలికి సత్య భాస్కర్, కోట్టేటి పవన్‌కిశోర్, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ, ముమ్మన ప్రకాష్, గుడివాడ సర్పంచ్ కనపర్తి చీమదొర, బాబీ, బొబ్బిలి హరిబాబు, అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, మహిళా అభిమానులు పాల్గొన్నారు.

ఆదరించండి.. అభివృద్ధి చేస్తా

- ఎఫ్‌కే పాలెంలో వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి వంగా గీత ప్రచారం



ఎఫ్‌కేపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వంగా గీత తదితరులు

పిఠాపురం: ఓటు వేయడం మీ పని.. అభివృద్ధి చేయడం నా పని.. అంటూ వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీత చేస్తున్న ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. ఎటుచూసినా జనం ఆమెకు బ్రహ్మరథం పడుతున్నారు. ఎఫ్‌కేపాలెంలో గురువారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. ఇప్పటి వరకు ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. ప్రజల ముందుకే పాలన తెచ్చి సంక్షేమ పథకాలను ప్రజల ఇళ్లకే చేర్చుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని వంగా గీత ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అందరికీ అందుబాటులో ఉండే తనకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలని కోరారు. అడుగడుగునా మహిళలు ఆమెకు స్వాగతం పలకగా, ఆమె వారిని ఆప్యాయంగా పలకరించారు. గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లిన ఆమె ఇప్పటి వరకు తాను పిఠాపురానికి చేసిన అభివృద్ధిని వివరించారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు మాట్లాడుతూ వంగా గీతను అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ పిఠాపురం మండల అధ్యక్షుడు జవ్వాది నాయుడు, సర్పంచ్ ముమ్మిడి మహాలక్ష్మి, ముమ్మిడి శేఖర్, ఎంపీటీసీ ప్రమీల, ముమ్మిడి వెంకన్నబాబు, జవ్వాది కృష్ణమాధవరావు, మలిరెడ్డి రాజా, అనసూరి గోపి, ముడుగు రాజు, ముడుగు కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో వంద మంది చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో దవులూరి సుబ్బారావు తదితరులు

సామర్లకోట: సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని స్థానిక 17వ వార్డులోని జనసేనకు చెందిన 150 మంది కార్యకర్తలు వైఎస్సార్ సీపీ నాయకుడు మిరియాల సాగర్ ఆధ్వర్యంలో గురువారం పార్టీలో చేరారు. వారికి దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు పార్టీ కండువాలు వేసి పార్టీలోనికి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ వలనే మేలు జరుగుతుందని బావించి పార్టీలోనికి చేరుతున్నట్లు జనసేన కార్యకర్తలు తెలిపారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మైలవరపు జానీ మోజెస్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పాగా సురేష్‌కుమార్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయం తథ్యం

గొరకపూడి చిన్నయ్యదొర



సామర్లకోట: తెలుగుదేశం, బీజేపీ, జనసేన కూటమిది బలం కాదు, వాపు అని ఉమ్మడి రాష్ట్ర కౌన్సిల్ చాంబర్ మాజీ అధ్యక్షుడు గొరకపూడి చిన్నయ్యదొర అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక సంపెంగతోటలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మూడు పార్టీల కలయిక వల్ల వైఎస్సార్ సీపీ బలం పెరిగిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విమర్శలు చేసిన వారే ఆ పథకాలకు మించి ప్రజలకు ఇస్తామని ప్రచారం చేయడం విడ్డూరంగా ఉన్నదన్నారు. గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయక పోవడం వల్ల ప్రజలు ఆయన హామీలను నమ్మే స్థితిలో లేరని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయడమే కాకుండా ఇవ్వని అనేక హామీలను అమలు చేశారని, దాంతో ఆయనపై ప్రజలల్లో నమ్మకం పెరిగిందన్నారు. వైఎస్సార్ సీపీలో చేరిన తరువాత రాష్ట్రం అంతా పర్యటించడం జరిగిందని, ప్రతి ఒక్కరూ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా కోరుకొంటున్నారని చిన్నయ్యదొర తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక సంస్థలలో వైఎస్సార్‌సీపీ చెందిన ప్రజాప్రతినిధులు ఉండటం వలన వైఎస్సార్ సీపీ విజయం మరింత సులభం అవుతుందని చెప్పారు. నియోజకవర్గంలో రెండు మున్సిపాలిటీలు, రెండు మండలాల్లో ఏకపక్షంగా కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఉన్నారని దాంతో విజయం సాధించి తీరుతామనే ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు మేలు చేసే వారినే ప్రజలు నమ్ముతారని చెప్పారు.

తొలి రోజు నామినేషన్లు నిల్

- షెడ్యూల్ విడుదల చేసిన ఈఆర్వో రామారావు



నామినేషన్ల స్వీకరణకు సిద్ధమైన ఎన్నికల సిబ్బంది

పెద్దాపురం: సార్వత్రిక ఎన్నికల పర్వంలో నామినేషన్ల స్వీకరణ గురువారంతో ప్రారంభమైంది. కాగా తొలిరోజు ఎవరూ నామినేషన్ దాఖలు చేయలేదని ఈఆర్వో జేఎస్ రామారావు తెలిపారు. ఉదయం 10 గంటలకు షెడ్యూల్ కాగితాన్ని ఆయన విడుదల చేసి నోటీస్ బోర్డుపై ఉంచారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఉదయం 11 గంటల నుంచి మూడు గంటల వరకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నామినేషన్ ప్రక్రియ ఎన్నికల కమిషన్ నిఘా నేత్రంలో నిర్వహించామన్నారు. నామినేషన్ల సమయంలో స్వీకరించే ప్రదేశం నుంచి సుమారు 100 మీటర్లు లోపు అభ్యర్థులను అనుమతిస్తామని, 25వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలలోపు వచ్చిన నామినేషన్లు మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని, ప్రజలు నిర్భయంగా ఓటు వేసేలా ఏర్పాట్లు పూర్తి చేశామని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో పారా మిలట్రీ దళాలను నియమించడంతో పాటు మొత్తం ప్రక్రియను వెబ్‌కాస్టింగ్ ద్వారా వీడియో రికార్డింగ్ చేస్తున్నట్టు తెలిపారు. ఓటు హక్కు కల్గిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని రామారావు కోరారు. నామినేషన్ కార్యాలయం వద్ద డీఎస్పీ లతాకుమారి ఆదేశాల మేరకు సీఐ రవికుమార్ పర్యవేక్షణలో ఎస్ఐ వెలుగుల సురేష్ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మూకుమ్మడిగా వలంటీర్ల రాజీనామా



నాగులపల్లిలో పంచాయతీ కార్యదర్శికి రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

కొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 127 మంది వలంటీర్లు గురువారం మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. వలంటీర్ల సేవలపై టీడీపీ నేతలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి, పింఛన్ల పంపిణీని అడ్డుకోవడంతో మనస్తాపం చెంది, రాజీనామా చేస్తున్నట్టు గ్రామ వలంటీర్లు పేర్కొన్నారు. మండలంలోని రమణక్కపేట–20, యండపల్లి–24, నాగులపల్లి–13, ఇసుకపల్లి–12, మూలపేట–4, అమీనాబాద్–16, ఉప్పాడ–38 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. మండలంలో మొత్తం 179 మంది రాజీనామాలు చేశారు.

అనాలోచిత చర్యతో డ్రైనేజీ పూడిక



గ్రావెల్‌తో మూసుకుపోయిన డ్రైన్



డ్రైన్ పూడిక తీస్తున్న పారిశుధ్య సిబ్బంది

- తొలగించిన పారిశుధ్య సిబ్బంది

సామర్లకోట: ఓ స్థల యజమాని అనాలోచిత చర్య వల్ల డ్రైనేజీ పూడుకుపోయి మురుగునీరు రోడ్డుపై ప్రవహించి స్థానికులకు అసౌకర్యం కలిగించింది. ఈ మేరకు వారు మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, టౌన్ ప్లానింగ్ అధికారి ఫణికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు ఫిర్యాదు చేశారు. దాంతో మున్సిపల్ సిబ్బంది గురువారం శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో డ్రైనేజీ పూడిక తీయించి పరిస్థితి చక్కదిద్దారు. కాగా తన స్థలాన్ని చదును చేసే క్రమంలో గ్రావెల్‌ను పొక్లెయిన్‌తో తరలించే క్రమంలో స్థలానికి ముందున్న డ్రైనేజీ ధ్వంసమై మురుగునీరు రోడ్డుపైకి వచ్చిందని, ఇందుకు కారణమైన స్థల యజమానికి నోటీసులు ఇచ్చి తగిన చర్యలు తీసుకొంటామని మున్సిపల్ కమిషనర్ రామారావు హెచ్చరించారు.

ప్రకటనలకు అనుమతులు తప్పనిసరి

- కలెక్టర్ నివాస్
- మీడియా సమాచార కేంద్రం ప్రారంభం

కాకినాడ సిటీ: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా గురువారం కలెక్టరేట్‌లో సమాచారశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమాచార కేంద్రం, మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ జె.నివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలలో పోటీ చేసే రాజకీయ పార్టీల అభ్యర్థులు మీడియా సర్టిఫికెట్ నిమిత్తం మీడియా సర్టిఫికేషన్, మోనటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కమిటీ ద్వారా ముందుగా ఎంసీఎంసీ కేంద్రంలో వివిధ ప్రచారాలకు అవసరమైన ప్రకటనలకు దరఖాస్తు చేసుకుంటే నిర్దేశిత వ్యవధిలో అనుమతులను జారీ చేస్తుందన్నారు. ఎన్నికలకు సంబంధించిన అభ్యర్థుల ప్రతి ప్రకటనకు ముందస్తు ఎంసీఎంసీ అనుమతి తప్పనిసరన్నారు. అభ్యర్థి ప్రచారం చేసుకునేటప్పుడు కమిటీ ద్వారా విధిగా అనుమతులు తీసుకోవాలన్నారు. వివిధ మాధ్యమాలలో వచ్చే ప్రకటనలను ఈ కమిటీ పర్యవేక్షిస్తుందని కలెక్టర్ వివరించారు. ప్రసార మాధ్యమాల్లో వచ్చే ప్రకటనలు అనుమతులకు ఆర్వోల ద్వారా నోటీసులు జారీ చేయిస్తామని కలెక్టర్ నివాస్ తెలిపారు. సాధారణ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో ప్రసార మాధ్యమాల సహకారం ఎంతో అవసరమని, అందువల్ల మీడియా ప్రతినిధులకు ఎన్నికల సమాచారాన్ని సకాలంలో అందించడంలో సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు సఫలీకృతం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడంలో మీడియా పాత్ర కీలకమన్నారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా మీడియా సహకారంతో విజయవంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. మే 13న పోలింగ్ ముందు, పోలింగ్ రోజున, పోలింగ్ తర్వాత దశలకు సంబంధించి ఎన్నికల సమాచారాన్ని, స్వీప్ కార్యక్రమాల సమాచారాన్ని మీడియా సెంటర్ ద్వారా ఎప్పటికప్పుడు అందిస్తామన్నారు. ఈనెల 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు సాయంత్రం 5 గంటలకు నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థుల పేర్లను మీడియా బులిటెన్ జారీ చేస్తామన్నారు. డీఆర్వో డి.తిప్పేనాయక్, ఎంసీఎంసీ మెంబర్లు కొడావీసీ పి.కృష్ణమూర్తి, జేఎన్టీయూ ప్రొఫెసర్ జేవీఆర్ మూర్తి, ఎస్.శివనారాయణరెడ్డి, సమాచారశాఖ డీడీ ఎంసీఎంసీ కన్వీనర్ డి.నాగార్జున, సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయ సిబ్బంది ఏఈఐఈ సి.బాబూరావు, డీఎల్ పీఆర్వో పి.రవి పాల్గొన్నారు.

24 నుంచి వేసవి శిక్షణ తరగతులు

బోట్‌క్లబ్: జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాలు మేరకు గాంధీనగర్ చిల్డ్రన్‌పార్కు ఆవరణలోని బాలభవన్‌లో ఈ నెల 24 నుంచి జూన్ 6 వరకూ వేసవి ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు బాలభవన్ పర్యవేక్షకురాలు శారద గురువారం విలేకర్లకు తెలిపారు. శిక్షణ తరగతులు ఉదయం 7.30 నుంచి 10.30 వరకూ తిరిగి సాయంత్రం 4.30 నుంచి రాత్రి 7.30 వరకూ జరుగుతాయన్నారు. గాత్ర సంగీతం, వయోలిన్, మృదంగం, కరాటే, తదితర విభాగాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.